www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 ఏప్రిల్ 2023
5
తిరుపతి



శ్రీవారి సేవలో శ్రీదేవి కుమార్తె జాన్వీకపూర్



ప్రజాశక్తి - తిరుమల

అందాల తార శ్రీదేవి కూతురు జాన్వీకపూర్ తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు ఆమెను ఆశీర్వదించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సాంప్రదాయ దుస్తుల్లో తిరుమలకు విచ్చేసిన జాన్వీ ఆలయం ఎదుట సాష్టాంగ నమస్కారం చేస్తూ భక్తిశ్రద్ధల్లో మునిగారు. ఆమెతో పాటు ప్రియుడు శిఖర్ పహారియా సైతం ఉన్నారు.వీరు గతకొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు నెట్టింట్లో వార్తలు వస్తున్నాయి. ఇటీవల నీతా అంబానీ కల్చరల్ ఈవెంట్‌కు బోనీకపూర్‌తో కలిసి శిఖర్ కనిపించారు. దీంతో వీరి ప్రేమకు పెద్దల నుంచి గ్రీన్ సిగ్నల్ ఉన్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

తిరుపతి జిల్లాకు ఏడాది..!

ప్రజలకు అందుబాటులో పాలనా వ్యవస్థ : కలెక్టర్
సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులకు రూ.2,378 కోట్లు జమ
15న 15వేల గృహాలు ప్రారంభానికి సన్నాహాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రజలకు అందుబాటులో పాలనా వ్యవస్థ ఉందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లాల విభజన జరిగి ఏప్రిల్ 4వ తేదీకి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మీడియాతో సోమవారం మాట్లాడారు. వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో 24,42,699 మందికి రూ.2,378 కోట్లు జిల్లాలోని లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు చెప్పారు. ఈనెల 15న 15వేల గృహాలు ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉందని, అంతర్జాతీయ విమానాశ్రయాలతో పాటు, జాతీయ రాష్ట్ర రహదారులు, పోర్టులు ఉన్నాయన్నారు. గత ఏడాది జిల్లా ఏర్పడిన నాటినుంచి నేటి వరకూ 15 పెద్ద పరిశ్రమలు రూ.5,409 కోట్ల పెట్టుబడులతో, 1835 మధ్యతరహా చిన్న పరిశ్రమలు ప్రారంభమై 15,696 మందికి ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. ఈ ఏడాది మరో 14 పెద్ద పరిశ్రమలు రూ.12,357 కోట్ల పెట్టుబడితో నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. దీనివలన మరో 21,626 మందికి ఉపాధి,



ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'స్పందన' కార్యక్రమాన్ని చేపడుతోందని, ఇప్పటివరకూ 12,422 వినతులు అందాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.53 కోట్లు నిధులు మంజూరు చేసి 1557 పనులు చేపట్టి 1420 ఇప్పటికే పూర్తి చేసినట్లు చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి పేద విద్యార్థులకు ఉచిత ప్రైవేట్ కార్పొరేట్ విద్య కల్పిస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేవని, అధికంగా ఎండల నమోదు, వడగాల్పుల హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశామన్నారు. చలివేంద్రాల ఏర్పాటు, పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు, ప్రధాన కూడళ్ళలో చలువ పందిళ్ళు, అన్ని ఆరోగ్య కేంద్రాలలో, సచివాలయ స్థాయి హెల్త్ క్లినిక్ లలో అవసరమైన ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచామన్నారు.



బిఎన్ కండ్రిగలో..



పుత్తూరులో...

టెన్త్ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 249మంది గైర్హాజర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, యంత్రాంగం

టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. 152 కేంద్రాల్లో 26,854 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 26,605 మంది మాత్రమే హాజరయ్యారు. తొలిరోజు 249 మంది గైర్హాజరయ్యారు. 22 మంది సిట్టింగ్, 45 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించాయి. మొత్తం 54 మంది విద్యాధికారులు పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా బాధ్యత వహించారని జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద గంట ముందు నుండే విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. పరీక్షా కేంద్రాల వద్దనే తల్లిదండ్రులు వేచి ఉండి విద్యార్థులను తమవెంట తీసుకెళ్లడం కనిపించింది. ప్రతి సెంటర్ వద్ద 144 సెక్షన్ విధించి, జిరాక్స్ సెంటర్లను మూసేయించారు. మౌలిక వసతులను కల్పించారు.

దొరవారిసత్రంలో ఎ.కొల్లు పాఠశాలలో 121 మంది విద్యార్థులకు గాను 119 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల చీఫ్ ముత్తుస్వామి తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలలో 251 మందికి 249 మంది హాజరయ్యారని చీఫ్ పార్థసారథి తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిఐ సోమయ్య, ఎస్ఐ తిరుమలరావు 144 సెక్షన్ అమలు చేశారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలో ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. చీఫ్ ఎ.మునిసుబ్రమణ్యం, వెంకటరమణ, ఎ.దయాకర్‌రావు, శ్రీనివాసు పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చూశారు. పుత్తూరు పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. గూడూరులో పరీక్షా కేంద్రాల వద్ద డిఎస్‌పి సూర్యనారాయణరెడ్డి పరిశీలించారు.



పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే తిరుపతి టాప్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పన్నుల వసూళ్లలో, చాలా కాలంగా బకాయి వున్న పన్నులు వసూళ్లు చేయడంలో రాష్ట్రంలోనే తిరుపతి మొదటి స్థానంలో ఉందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలియజేస్తూ రెవెన్యూ అధికారులను ప్రసంసించారు. తిరుపతి నగరంలోని 68,913 ఆస్తులకు సంబంధించి రావల్సిన పన్నులు, బకాయిలు 65,92,72,936 రూపాయలు రావల్సి వుండగా 63,26,88,793 రూపాయాలను 96 శాతంతో వసూళ్ళు చేసి రాష్ట్రంలోనే తిరుపతి మొదటి స్థానం రావడం జరిగిందన్నారు. పన్ను వసూళ్ళకు కషి చేసిన తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిసి చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మను, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు రాజశేఖర్, శంకరయ్య, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సూరిబాబు, మధుసూధన్ రెడ్డి, ప్రకాష్, నవీన్, జ్యోతీష్ రెడ్డిలను సోమవారం స్పందనలో ప్రత్యేకంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మా మాట్లాడుతూ పెద్దల సూచనలతో తమ ఆర్.ఐ.ల తోడ్పాటుతో నగరంలోని 102 సచివాలయ అడ్మిన్లు, ఇతర సెక్రటరీల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం పన్నులపై వడ్డి మాఫి చేసిన విషయాన్ని ప్రతి ఒక్క ఆస్తిదారులు, బకాయిదారుల వద్దకు వెళ్లి వివరించి వసూలు చేశామన్నారు.

9నుంచి 'వందేభారత్' సేవలు

సికింద్రాబాద్-తిరుపతి మధ్య
3 గంటల సమయం ఆదా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈ నెల 9వ తేదీ నుంచి సికింద్రాబాద్ – తిరుపతి ప్రాంతాల మధ్య వందే భారత్ రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ రైలుకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న శ్రీవారి భక్తులకు ఎంతో అనుకూలంగా ఉండనుంది. మొత్తం 662 కిలోమీటర్ల ప్రయాణ దూరాన్ని కేవలం 8.30 గంటల్లోనే చేరుకోనుంది. ఏప్రిల్ 9వ తేదీన తిరుపతి నుంచి, పదో తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల నుంచి బయలుదేరుతుంది.

నిజానికి 8వ తేదీన సికింద్రాబాద్ నుంచి ప్రారంభిస్తారు. కానీ, ఆ రోజున రైలులో ప్రయాణికులు ఎక్కేందుకు అనుమతించరు. ఉదయం 11.30 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే ఈ రైలు అదే రోజు రాత్రి 9 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఒక్క మంగళవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఈ రైలు అందుబాటులో ఉంటుంది. అయితే, ఈ రైలు ప్రయాణ ఛార్జీలను రెండు మూడు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది. మరోవైపు, ఈ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 6



గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ మార్గంలో నల్గొండకు ఉదయం 7.19 గంటలకు, గుంటూరు జంక్షన్‌కు ఉదయం 9.45 గంటలకు, ఒంగోలుకు 11.09 గంటలకు, నెల్లూరుకు 12.29 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతిలో సాయంత్రం 3.15 గంటలకు బయలుదేరి నెల్లూరుకు సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడ నుంచి ఒంగోలుకు రాత్రి 6.30 గంటలకు, గుంటూరుకు రాత్రి 7.45 గంటలకు, నల్గొండకు రాత్రి 10.10 గంటలకు, సికింద్రాబాద్‌కు రాత్రి 11.45 గంటలకు చేరుకుంది. ఈ స్టేషన్ల మధ్యే ఈ రైలు ఆగుతుంది. అయితే, నెల్లూరు – తిరుపతి ప్రాంతాల మధ్య గూడూరు జంక్షన్ ఉంది. దీంతో ఈ రైల్వే స్టేషన్‌లో కూడా వందే భారత్ రైలును ఆపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే శ్రీవారి భక్తులు ఈ స్టేషన్‌లో దిగి, ఇక్కడ నుంచి మరో రైలులో వెళుతుంటారు. ఇలాంటివారితో స్థానిక ప్రజలను దష్టిలో ఉంచుకుని ఈ రైలును గూడూరు జంక్షన్‌లో ఆపాలని వారు కోరుతున్నారు. మరోవైపు, ఈ రైలులో ప్రయాణ చార్జీలను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. సాధారణంగా సికింద్రాబాద్ – తిరుపతి ప్రాంతాల మధ్య ప్రయాణ సమయం 11 లేదా 12 గంటల పాటు ఉంటుంది. ఈ వందే భారత్ రైలు సేవలు అందుబాటులోకి వస్తే ఈ ప్రయాణ సమయం 9 గంటలు మాత్రమే.. అంటే మూడు గంటల సమయం ఆదా కానుంది.



కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

మెగా డీఎస్సీ, గ్రూప్-2 విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మెగా డిఎస్సి, గ్రూప్ 2 నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. 35వేల ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ, 5600 పోస్టులకు గ్రూప్ 2 నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కార్యదర్శి నరేంద్ర, సుమన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ కష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం ఖాళీలన్నింటినీ కలిపి ప్రతి సంవత్సరం డీఎస్సీ, గ్రూప్ 2 నోటిఫికేషన్లు విడుదల చేస్తామనిజగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు నోటిఫికేషన్లు ఇవ్వకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నవీన్,రుపుచంద్, సురేష్,చరణ్ ఎస్ ఎఫ్ ఐ నాయకులు రవి అక్బర్ సురేష్ సునీల్ పాల్గొన్నారు.

'బాడీ బిల్డర్ల'కు బహుమతులు ప్రదానం

తిరుపతి సిటి :తిరుపతి జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలు తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పర్యవేక్షణలో సోమవారం స్థానిక యూత్ హాస్టల్ లో నిర్వహించారు. చిత్తూరు,తిరుపతి జిల్లా స్థాయి పోటీలు ముగిసాయి. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, కార్యదర్శి ఆర్ శ్రీధర్, గౌరవ అతిథులుగా ఆర్పీఎఫ్ సి మధుసూదన్, ఎస్ సుబ్బరాయుడు, గౌరవ అతిథులుగా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ ఈశ్వర ప్రసాద్, జిమ్నాస్టిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ వి శివప్రసాద్, పాట్రన్ వైఎస్ బాబు, పి జయ శేఖర్ పాల్గొని విజేతలకు ట్రోఫీల్డ్ తో పాటు మెడల్స్‌ని బహుకరించారు. జిమ్నాస్టిక్స్ జిల్లా విజేతగా బాలుర విభాగంలో ఎం వంశీ, బాలికల విభాగంలో స్విమ్స్ నందు బిఎస్సి నర్సింగ్ మూడవ సంవత్సర విద్యార్థిని



బండి చైతన్య ఛాంపియన్స్ గా నిలిచారు. బాడీ బిల్డింగ్ పోటీలలో 55 కేజీల విభాగంలో మణి,75 కేజీల విభాగంలో జె రవి, 80 కేజీల విభాగంలో మొహుద్దీన్ ఛాంపియన్లుగా నిలిచారు. అనంతరం జరిగిన చాంపియన్ ఆఫ్ ఛాంపియన్ పోటీలలో జే రవి కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు శ్రీకాకుళం జిల్లాలో పార్వతిపురం నందు జరగబోయే రాష్ట్ర క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్యకేసులో...

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నాగరాజు హత్యకేసులో చంద్రగిరి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. క్లూస్‌టీం ద్వారా విచారణ చేపట్టారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన సర్పంచి చాణుక్యప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గోపీనాథ్‌రెడ్డి, రూపంజయపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే చంద్రగిరి సిఐ ఓబులేష్ యాదవ్ ప్రధాన నిందితుడైన రూపంజయను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మిగిలిన ఇద్దరు నిందితులు బెంగుళూరులో తలదాచకున్నట్లు సమాచారం. గోపీనాథ్ రెడ్డి తండ్రిని చంద్రగిరి పోలీసులు విచారిస్తున్నారు. ఆ ఘటన రోజు అనుప్పల్లి పంచాయతీలో ఉన్న ముగ్గురు వ్యక్తులు నిందితుడికి సహాయ సహకారాలు అందించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీ డైకీన్ పరిశ్రమలో చోరీ

ప్రజాశక్తి - సత్యవేడు

డైకీన్ పరిశ్రమలో చోరీకి పాల్పడిన తొమ్మిదిమందిని అరెస్టు చేసి వారి నుంచి 200 మీటర్ల కాపర్ మెటీరియల్, రూ.1.80 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు శ్రీసిటీ హైటెక్ పోలీసు స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డైకీన్ ఏసీ తయారీ పరిశ్రమలో గత వారం విలువైన కాపర్ మెటీరియల్ చోరీ అయినట్లు పరిశ్రమ యాజమాన్యం శ్రీసిటీ హైటెక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పరిశ్రమలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న నలుగురు, మరో ఐదుగురితో కలిసి కాపర్ వైర్ చోరీకి పాల్పడినట్లు తెలిపారు.అదే పరిశ్రమలో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి నివారించే ప్రయత్నం చేయగా వారు తప్పించుకుని పరారయ్యారు. యాజమాన్యం ఫిర్యాదు మేరకు నిందితులను పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు పాత ముద్దాయిలుగా ఉన్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. సులభతరహా పద్ధతిలో సంపాదించాలనే ఆలోచనతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు.



వియత్నాం ఉద్యమం చిన్నదేశాలకు ఆదర్శం : ఆచార్య రాజారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్

పరిశోధకులకు వియత్నాం చరిత్రపై అవగాహన అవసరమని, వియత్నాం ఉద్యమం చిన్న దేశాలకు ఆదర్శమని వీసీ ఆచార్య కె.రాజారెడ్డి అనానరు. ఎస్వీయూ సౌత్ ఈస్టు ఏషియా అండ్ పసిఫిక్ స్టడీస్ కేంద్ర సంచాలకుడైన డాక్టర్ ఎం.ప్రయాగ రాసిన 'హో న్యూయన్‌జప్' అనే గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించారు. భారతదేశంలో వియత్నాం భాష మాట్లాడగలిగిన అతి కొద్దిమందిలో వీసీ రాజారెడ్డి ఒకరు. వియత్నాం దేశంలో పరిశోధన చేసే క్రమంలో ఆ దేశ భాషను పూర్తిగా నేర్చుకున్నారు. వియత్నాం వాసుల పట్టుదల, పోరాట పఠిమ, కష్టించేతత్వం, గెరిల్లా పోరాట పద్ధతులను వారు వివరించారు. ఒకవైపు ఫ్రెంచితోనూ, మరోవైపు అమెరియా సంయుక్త రాష్ట్రాలతోనూ పోరాడి స్వాతంత్ర్యం పొందిన ప్రజల శక్తి సామర్థ్యాలు, వారి నాయకుడు న్యాయన్ జప్ నడిపిన ఉద్యమాలు ప్రతి చిన్న దేశానికి ఆదర్శమన్నారు. గ్రంథకర్త డాక్టర్ ప్రయాగ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రసిద్ధమైన కమాండర్ జనరల్స్ లోజప్ ఒకరని, ఆయన వియాత్నాం పౌరుల్లో నింపిన ఉత్తేజం, ధైర్యం వల్లనే ఆ దేశం స్వాతంత్ర్యం సాధించి అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళుతోందన్నారు. ఈ కార్యక్రమానికి ఆచార్య జయచంద్రారెడ్డి అధ్యక్షులుగా వ్యవహరించారు. డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ పద్మజ, డాక్టర్ తిమ్మప్ప పాల్గొన్నారు

చెరివి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సత్యవేడు

చెరివి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారికి మంగయ్య ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ సి.విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద 2014 నుంచి 2023 వరకూ జరిగిన అభివృద్ధి వివరాలు ఇవ్వాలని కోరగా మండల అధికారి స్పందిస్తూ రికార్డుల పరిశీలనకు అనుమతి ఇచ్చారని తెలిపారు. ఏడాదికి 15 లక్షలు ఖర్చు చేసినట్లుగా రికార్డులు సృష్టించి, బిల్లులు మాత్రం కేవలం 55వేల నుంచి 60వేల వరకు ఉన్నాయని తెలిపారు. పదేళ్ల రికార్డులు అడిగితే ఒక సంవత్సరం రికార్డులు ఇచ్చారని, మిగతా ఖర్చుల గురించి



పంచాయ్తుఈ కార్యదర్శిని అడగ్గా తనకు తెలియదని సమాధానం చెబుతున్నారన్నారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రికార్డులను సీజ్ చేసి విచారణ జరపాలని కోరారు.

ఐకాన్, హైకెపాసిటీ ఇన్వర్టర్ విడుదల

ప్రజాశక్తి - తిరుపతి సిటీ



పవర్ బ్యాకప్, రెసిడెన్షియల్ సోలార్ స్పేస్‌లో నమ్మకమైన బ్రాండ్ ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ తమ పూర్తి సరికొత్త శ్రేణి ఫ్యూచరిస్టిక్ ఉత్పత్తులను రాబోయే వేసవి కోసం విడుదల చేసింది. స్మార్ట్, సేఫ్, ఇంధన సామర్థ్యం కలిగిన సస్టెయినబల్ ఉత్పత్తులతో వినియోగదారులను ఆనందపరచాలనే కంపెనీ నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ ఆవిష్కరణ జరిగింది. తిరుపతిలో జరిగిన సమావేశంలో ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మాన్యుఫాక్చరింగ్ అండ్ గ్లోబల్ సప్లయ్ చైన్ రాజీవ్ గంజు ఈ విశేషాలను తెలియజేశారు.ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా పవర్ బ్యాకప్ పరిష్కారాలను ల్యుమినస్ అందిస్తుంది. దాదాపు 100 మిలియన్ కుటుంబాలు తమ ఉత్పత్తులను వినియోగిస్తున్నాయన్నారు. ల్యుమినస్ భావి కార్యకలాపాలను గురించి ల్యుమినస్ పవర్ టెక్నాలజీస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ప్రీతి బజాజ్ మాట్లాడుతూ రాబోయే మూడు సంవత్సరాలలో 12 15% వద్ధి సాధించడాన్ని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ఉత్పత్తుల పరంగా లిథియం అయాన్ బ్యాటరీలను విడుదల చేయడంతో పాటుగా హై పవర్ ఇన్వర్టర్స్ వంటివి సైతం విడుదల చేయనున్నామని అన్నారు.

శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి అర్బన్ శెట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శెట్టిపల్లి రైతులకు, ఇళ్లస్థలాల పేదలకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో డిఆర్‌ఓకు సిపిఐ బృందం చిన్నం పెంచలయ్య, జె.విశ్వనాథ్‌లతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే భూ సమస్య ఏ మేరకు పరిష్కారం జరిగిందో ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. వెంటనే గ్రామస్తుల అంగీకారం మేరకు సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు.

'స్పందన' వినతులు పరిష్కరించాలి : డిఆర్ఒ

తిరుపతి టౌన్ : 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధిలోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు పరిష్కారం చూపాలని డిఆర్ఒ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండ రామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి రశీదులు అందించారు. మొత్తం 123 వినతులు అందాయి.

ఆర్టీసీ బస్సు బోల్తా - ప్రయాణికులకు స్వల్పగాయాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి సమీపంలోని అగ్రహారం సర్కిల్‌లో సోమవారం ఉదయం ఏడు గంటలకు అడపారెడ్డిపల్లి నుంచి తిరుపతి బస్టాండ్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సును చిత్తూరు నుంచి రేణిగుంట వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో బస్సు బోల్తా పడింది. ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోజుకు రెండు మూడు ప్రమాదాలు ఈ సర్కిల్‌లో జరుగుతున్నా అటు ట్రాఫిక్, ఇటు తిరుచానూరు పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ జాతీయ రహదారిలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఫ్లైఓవర్ పరిష్కారమార్గమని స్థానికులు కోరుతున్నారు.



'ఇంటింటికీ మీ బొజ్జల'ను ఆదరించండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల పాలనను తిరిగి అందించడమే తమ లక్ష్యమని మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ చెప్పారు. పట్టణంలోని స్థానిక ఎన్టీఆర్ భవన్ లో సోమవారం 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం గోడ పత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ నెల 5వ తేదీ నుంచి 'ఇంటింటికి మీ బొజ్జల' కార్యక్రమానికి సుధీర్ బాబు శ్రీకారం చుడుతున్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు తన బిడ్డ సుధీర్ బాబును మంచి మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మాదిరిగానే పాలన చేసి ఇక్కడ రామరాజ్యం స్థాపిస్తారని ఆమె చెప్పారు. సమావేశంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ దామోదరనాయుడు తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని.. ప్రవేశ పరీక్షతో ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. సీబీఎస్ఈ విధానంలోనే ఉచిత విద్య, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్‌నంబరు 9347732918 ను సంప్రదించాలని కోరారు.

చిట్టమూరులో ఉచిత వైద్యసలహాలు


ప్రజాశక్తి-వాకాడు: చిట్టమూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నెల్లూరు నారాయణ వైద్యశాల డాక్టర్ల బృందంతో సోమవారం ఉచిత సలహా వైద్యశిబిరం నిర్వహించారు. టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు గణపరెడ్డి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ రంజిత్, డాక్టర్ కిరప్మై వారి బృందంతో వైద్య పరీక్షలు అందించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నారావు, మారంరెడ్డి జనార్దన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, శ్రీనివాసులు, కస్తూరయ్య, మునిబాబునాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశమ్మకు గాలి భానుప్రకాష్ పరామర్శ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తడుకు పంచాయతీలోని మాజీ ఎంపీటీసీ దేశమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ సోమవారం పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట తడుకు పంచాయతీ సర్పంచ్ బొప్పిలి వెంకటేష్, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరులోని కోనేటి మిట్టలో వెలసిన కోదండరామాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని ఆలయ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం, బుధవారాలలో సాయంత్రం 6 నుంచి క్లాసికల్ డ్యాన్స్, ఫోక్ డాన్స్, నాటక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఆలయ అర్చకులు సాయిపవన్ బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు, ధర్మకర్తలు దగ్గోలు సురేంద్రబాబు, ఉప్పల పెంచల గౌడ్, అర్చకులు నారాయణ, సాయిపవన్, ఆలయ గుమస్తా సత్యనారాయణరెడ్డి, అటెండర్ విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై వినతి

ప్రజాశక్తి-పెళ్లకూరు: తమ గ్రామంలో అక్రమ లేఅవుట్లు ఉన్నాయని.. గ్రామానికి 10 శాతం భూమి కేటాయించాలని కోరినా పట్టించుకోలేదని పెళ్లకూరు పరిధిలోని తాళ్వాయిపాడు గ్రామస్తులు సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డికి వినతి పత్రం అందించారు. అధికారులు స్పందించి గ్రామానికి న్యాయం చేయాలని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ప్రజాశక్తి-నాగలాపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఎంపీడీవో పద్మజ అన్నారు. సోమవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గర్భిణులు సకాలంలో పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేందుకు అవకాశం ఉంటుందని.. మాతాశిశు మరణాలు తగ్గించవచ్చన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీపీ సింధుశ్యామ్, జడ్పీటీసీ సుమతి మహేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ సునీత, అంగన్వాడీ కార్యకర్తలు విజయ, సావిత్రి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసిన 'మేరిగ'



ప్రజాశక్తి-గూడూరు టౌన్: తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని సోమవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలతో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపల్లి వరప్రసాద్‌రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపురెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వంతో జపనీస్ కంపెనీల చర్చలు




ప్రజాశక్తి-వరదయ్యపాలెం: శ్రీసిటీ జపనీస్ ఇండస్ట్రీస్, జపాన్ ఎక్స్టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో) సీనియర్ ప్రతినిధులు ఏపీ ప్రభుత్వంతో సోమవారం సమావేశమయ్యారు. డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్, ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఏపీఈడీబీ సీఈవో డాక్టర్ సృజన గుమ్మల్ల(ఐఏఎస్) అధ్యక్షత వహించారు. జపాన్ కాన్సుల్ జనరల్ మసయుకి టగాచే, ఏపీఈడీబీ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ సవరపు, అడిషనల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు అందేనా..!

● న్యాయం చేయకుంటే ఆత్మహత్యలే శరణ్యం ● తహశీల్దారు కార్యాలయం ఎదుట దళితుల నిరసన







ప్రజాశక్తి-బాలాయపల్లి: అసైన్‌మెంట్ భూములు భూస్వాములకేనా అంటూ మండలంలోని వాక్యం గ్రామానికి చెందిన దళితులు సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాక్యం దళితులు మాట్లాడుతూ ఏడో విడతలో తాము సాగు చేసుకున్న భూములకు హక్కు కల్పిస్తామని చెప్పిన అధికారులు.. అప్పుడు వచ్చిన లిస్టును రద్దుచేసి భూములు గున్న భూస్వాములకే పట్టాలు మంజూరు చేసేందుకు రెవెన్యూ శాఖ అధికారులు చేస్తున్నారని మండిపడ్డారు. తాము సాగు చేసుకున్న భూములను వేరే వాళ్లకు ఇస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పుడైనా పేదలు భూమి కోసం తిరగబడితే తాత్కాలికంగా పేదలకు భూ పంపిణీ చేస్తామని చెప్పి ఉద్యమాలను పక్కదారి పట్టిస్తున్నాయని..అసైన్డ్ భూములను దళితులకు ఇస్తామని 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.కమిటీల కారణంగా అనర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేస్తామని తెలిపారు.

సాగుభూమికి పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: సుమారు 50 సంవత్సరాల నుంచి. సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలివ్వాలని సిపిఐ కార్యదర్శి కత్తి ధర్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసి రాజన్ ఆధ్వర్యంలో కాటూరు రెవెన్యూ వి.ఎస్.పురం దళితులు వినతిపత్రం అందజేశారు. వి.ఎస్.పురం గ్రామంలో సర్వేనంబర్లు 340, 341 లలోని భూములను దళితులు భూమిని నమ్ముకొని సాగు చేసుకుంటున్నారని.. అదే గ్రామానికి చెందిన కొందరు రాజకీయ పలుకుబడితో రెవెన్యూ అధికారుల అండదండలతో బోగస్ పట్టాలు సృష్టించుకుని అనుభవంలో ఉన్న దళిత రైతులను భయానికి గురిచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సాగులో ఉన్న రైతులకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెంచల శివకుమార్, రుద్రపాక శ్రీనివాసులు, కృష్ణయ్య, దాసు, సీనయ్య, పోలమ్మ, పీటర్ మణి, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సాగు భూములు కేటాయించాలి

ప్రజాశక్తి-ఓజిలి: భూమిలేని నిరుపేద గిరిజనులకు అసైన్మెంట్ కమిటీలో భూములు కల్పించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ డి.లాజరాస్ కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓజిలి మండల పరిధిలో కుందాం గ్రామంలో సర్వేనెంబర్ ఒకటిలో వందలాది ప్రభుత్వ మిగులు భూములు ఉన్నాయని.. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ గిరిజనులు నివాసం ఉంటున్నారని, భూములు లేని గిరిజనులకు సాగు భూములు ఇవ్వాలని కోరారు. గిరిజనులకు జీవనాధారం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు గోపాలయ్య, కుందాం గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అంతర్గత రోడ్లకు మహర్దశ



ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ గడ్డకిందపల్లి, తూర్పుపల్లి, తువ్వచేనుపల్లి, అమాసవారిపల్లి గ్రామాలకు జాతీయ రహదారి నుంచి వెళ్లే మట్టి రోడ్లను సిమెంటు రోడ్లుగా మారుస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని అంతర్గత రోడ్లను సైతం సిమెంటు నిర్మాణం చేస్తుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గడ్డకిందపల్లికి వెళ్లే మట్టిదారి సిమెంటు రోడ్డుగా మార్చడం, సోమవారం మిగిలిన మూడు గ్రామాల్లో రూ.30 లక్షలు ఖర్చు చేసి సిమెంటు రోడ్ల నిర్మాణానికి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి భూమి పూజ చేశారు. తరతరాలుగా మట్టి రోడ్లపై నడుస్తూ కాలం గడిపిన తమకు సిమెంటు రోడ్లు వేసి గ్రామానికి అందం తీసుకు వస్తున్నారని స్థానిక మహిళలు మోహిత్ రెడ్డిని కలసి కతజ్ఞత తెలిపారు. ఎంత మంది పాలకులు వచ్చినా తమ గ్రామాల రోడ్లుకు మోక్షం కలగలేదని, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వల్ల సిమెంటు రోడ్లు వచ్చాయని మహిళలు స్పష్టం చేశారు. అంతేకాక కరోనా వంటి కష్టం వచ్చినా, పండుగలకైనా, పెళ్లిళ్లకైనా, ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలన్నా తమకు అండగా నిలిచే చెవిరెడ్డి వంటి మంచి మనస్సు కలిగిన వ్యక్తి ఎమ్మెల్యేగా పొందడం తమ అద్రుష్టమని, ఆయన బిడ్డకు తామంతా తోడుగా ఉంటామని తువ్వసేనుపల్లికి చెందిన మహిళలు మోహిత్ రెడ్డికి చేతిలో చేయి వేసి మాట ఇచ్చారు. స్థానిక నేతలు మోహిత్‌రెడ్డికి గ్రామస్థులను పరిచయం చేయించారు.

అంతర్జాతీయ సంస్థలతో సత్సంబంధాలు అభినందనీయం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన రంగాలలో శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు అంతర్జాతీయ సంస్థలతో చేసుకున్న సత్సంబంధాలు అభినందనీయమని వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె. రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వ్యాపార నాయకత్వ విభాగం అంతర్జాతీయ వ్యవహారాల కేంద్రంల సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రి ఇండో కెనడీయన్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో రెండు వారాల పాటు అధ్యాపకులకు, విద్యార్థినులకు బోధన, పరిశోధన, వివిధ యాజమాన్య విషయాలలో, మానవ వనరుల అభివద్ధి శిక్షణ వంటి కార్యక్రమాలలో శిక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించే కార్యక్రమాన్ని సోమవారం సావేరి అతిథి గహంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన అంతర్జాతీయ సంబంధాల విషయాలలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కెనడియన్ విద్యాసంస్థలతో సంబంధాలు నెరపడం ఎంతో అభినందనీయం అన్నారు. వర్సిటీ కుల సజీవులు ఆచార్య ఎన్. రజిని మాట్లాడుతూ న్యాక్, నూతన జాతీయ విద్యా విధానం 2020 లో భాగంగా అంతర్జాతీయ సంస్థలతో బోధనా, పరిశోధన, శిక్షణ రంగాలలో వివిధ రకాలైన సత్సంబంధాలను కొనసాగించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కెనడియన్ విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ బెండ స్ట్రోక్స్, అంతర్జాతీయ వ్యవహారాల కేంద్రం డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీరజని, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినీలు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వసతులు కల్పించడంలో వర్సిటీలు వైఫల్యం



ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులకు నైతిక ప్రమాణాలు, వసతులు కల్పించడంలో వర్సిటీలు వైఫల్యమని టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. విద్యావ్యవస్థలో నెలకొన్న అనిశ్చితికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకొని ఖాళీలను భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేసేలా పరిశోధనలు జరిగేలా చేయాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు ఆర్కే నాయుడు వీసీ ఆచార్య కె.రాజారెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎన్నో ఆశలతో ఆశయాలతో పరిశోధనలు చేయాలన్న లక్ష్యంతో పీహెచ్‌డీ విద్యార్థులకు నైతిక ప్రమాణాలు.. వసతులు కల్పించడంలో విశ్వవిద్యాలయాలు విఫలం చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రబాబు, శ్రీరామ్, రవి, రాజ్ కుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి పనులు



ప్రజాశక్తి-సత్యవేడు: అందరి సహకారంతోనే సత్యవేడు మండలంలో అభివృద్ధి పనులు జరుగుతాయని.. ఇంజినీరింగ్ అధికారులదే బాధ్యతని జడ్పీటీసీ విజయలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బాలగణేష్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రధానంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గుత్తేదారులతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలన్నారు. పూర్తయిన పనులకు బిల్లులు సకాలంలో అందించాలన్నారు. వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ఆలోచన ధోరణి మారాలని సూచించారు. ఆయా పంచాయతీలలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు వీలైనంత వరకు పూర్తి చేయించడానికి సంబంధిత సర్పంచులు, ఎంపీటీసీలు చొరవ చూపాలన్నారు. ఈనెల 14వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాల ప్రగతి కనిపించాలన్నారు. సమావేశంలో పంచాయితీరాజ్ డీఈ మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్, సర్పంచులు శేఖర్, మునస్వామి, బాలాజీ, గుత్తేదారులు కనకరాజు, వెంకటేశ్వర్లు, బాబు, శ్రీరాములురెడ్డి, సన్నాసయ్య, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై కేంద్ర ప్రభుత్వం ఉన్మాద చర్యలు




ప్రజాశక్తి-రేణిగుంట: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం ఉన్మాది చర్యలకు పాల్పడుతోందని రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్ ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీ పై తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకిస్తూ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ జెండాలను పట్టుకుని స్థానిక పార్టీ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని, గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉన్మాదిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యార్లపల్లి గోపి, వడివేలు, వెంకటేష్‌గౌడ్, మణి, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదూరి కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగపు పరిశోధక విద్యార్థి ఈదూరి కిరణ్ కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విభాగంలో ప్రొఫెసర్ ఐ. చంద్రయ్య పర్యవేక్షణలో "యుటిలైజేషన్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ రీసోర్సెస్ ఇన్ గవర్నమెంట్ అండ్ ఎయిడెడ్ డిగ్రీ కాలేజెస్ ఇన్ నెల్లూరు డిస్ట్రిక్ట్, ఆంధ్ర ప్రదేశ్ – ఏ స్టడీ" అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. కిరణ్ కుమార్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధనా వ్యాసాలను ప్రచురించినట్లు వివరించారు. కిరణ్ కుమార్ కు డాక్టరేట్ అవార్డు రావడంపై ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు హర్ష వ్యక్తం చేశారు.

రేపు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ఈనెల ఐదో తేదీన తిరుపతిలో నిర్వహించనున్న బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి ఉత్సవాలకు దళి తులందరూ తరలిరావాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు తేనేపల్లి గురుశంకర్ ప్రసాద్ కోరారు. సోమవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలసి విడుదల చేశారు. 116వ జయంతి ఉత్సవాలు తిరుపతి బైరాగిపట్టెడ ఆర్చికి ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో సమావేశం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వెంకటరమణ, వెంకటరామయ్య, రామచంద్రయ్య, నాగులయ్య, దళిత నాయకులు నాగయ్య, సహదేవయ్య, మహిళా రైతులు చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు రూ.34.86 లక్షలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సమగ్రశిక్ష జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి వారి తల్లిదండ్రుల అకౌంట్లలో రూ.34.86 లక్షలు జమచేసినట్లు సమగ్రశిక్ష ఆడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వి.శేఖర్, సహిత విద్య కో ఆర్డినేటర్ వి. రామచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 546 మంది దివ్యాంగ బాలికలకు ఉపకార వేతనం రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.10.92 లక్షలు, ప్రత్యేక అవసరాలు కలిగిన 430 మంది విద్యార్థులకు ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్ కింద రూ.3 వేలు చొప్పున రూ. 12.9 లక్షలు, అతి తీవ్ర మేధా వైకల్యం కలిగి పాఠశాలలకు వెళ్లలేని 316 మంది పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.3 వేలు చొప్పున రూ.9.48 లక్షలు, కండరాల కదలికలు లేని పిల్లలు, బుద్ధి మాంద్యం కలిగిన పిల్లలకు సహిత విద్య రిసోర్స్ ఉపాధ్యాయుల ఇంటి వద్దకే వెళ్లి బోధన అందిస్తారు. అలాంటి 52 మందికి గహ ఆధారిత విద్య అలవెన్స్ కింద రూ.3 వేలు చొప్పున రూ.1.56 లక్షలను ఆయా అకౌంట్లలో జమచేసినట్లు పేర్కొన్నారు.

12 నుంచి 'మీ ఇంటికే మీ నాని'

ప్రజాశక్తి -తిరుపతి రూరల్: ఈనెల 12 నుంచి 'మీ ఇంటికే మీ నాని' కార్యక్రమాన్ని టీడీపీ ఆధ్వర్యంలో జరుగనుందని తిరుపతి రూరల్ మండలం టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని చేపట్టబోతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి కోరారు.కార్యక్రమంలో అమిలినేని మధు, సాల్మన్ రాజు, పెరుగు భాస్కర్ రెడ్డి , కరీముల్లా ,మునిరత్నం రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ జానకిరామ్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా పట్టుబడిన మద్యం సీసాలను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పెళ్లకూరు ఎస్సై కష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అసత్యపు ప్రచారాలు దారుణం

ప్రజాశక్తి-కోట: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన గెలుపునకు సహకరించకపోవడంతో ఎన్నికల్లో ఓటమితో మనస్తాపం చెంది టీడీపీ నేత లోకేష్ బాబును కలిసినట్లు షోషల్ మీడియాలో అసత్యపు కథనాలు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి సోమవారం కోట పోలీస్ స్టేషన్లో ఎస్సై పుల్లారావుకు ఫిర్యాదు చేశారు.

కబ్జా స్థలంలో శాశ్వత నిర్మాణాలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎస్సీల సంక్షేమం కోసం 2005లో ఆటోనగర్ పరిధిలోని అక్కారంపల్లి లెక్కదాఖల్లో సర్వేనెంబర్ 74/5 లో 20 సెంట్లు స్థలాన్ని అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని.. నేడు కొందరు ఈ స్థలాన్ని కబ్జా చేసి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తిరుపతి డివిజన్ అధ్యక్షులు ఏఎస్ శంకరరావు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమం కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాలని తిరుపతి అర్బన్ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు కట్టడాలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే నిర్మాణం ఆపాలని హెచ్చరికలు జారీ చేశారన్నారు. అయినా రెవెన్యూ అధికారుల ఆదేశాలను ఏమాత్రం ఖాతరు చేయని నాగేశ్వరరావు మళ్లీ నిర్మాణ పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ కు స్పందనలో అర్జీ ఇచ్చామన్నారు. అయినా ఇప్పటివరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నాగేశ్వరరావు చేస్తున్న నిర్మాణాలను వెంటనే ఆపకపోతే ఎంఆర్పిఎస్ దళిత సంఘాలతో కలిసి రెవెన్యూ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ స్థలంలో ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విగ్రహం ప్రతిష్టాపనకు అనుమతి ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, ముకుంద పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో 'బియ్యపు' ఓటమి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాబోయే ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఓటమి ఖాయమని..టీడీపీ అధికారంలోకి రావాలని నరబలుల పూజలు చేస్తున్నారని ఎమ్మెల్యే అనడం సబబు కాదని.. వాస్తవానికి నరబలులకు పేటెంట్ హక్కు వైసీపీకే ఉందని.. అందులో భాగంగానే సొంత చిన్నాన్న వైయస్ వివేకానందరెడ్డిని నరబలిగావించారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజినీకాంత్‌నాయుడు ఎద్దేవా చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు శ్రీకాళహస్తి ప్రాంతంలో అనేక పరిశ్రమలను, కేంద్ర విద్యాసంస్థలను నెలకొల్పామన్నారు. బాధ్యత గల శాసనసభ్యుడిగా ఉండి పరిశ్రమల యజమానుల వద్ద కమిషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కామెడీ చేస్తున్నారని, నియోజకవర్గ ప్రజలు అనుకునే స్థాయికి దిగజారారన్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, పెరుమాళ్ మధుబాబు, ఆర్పీ శ్రీనివాసులు, గుత్తా శరత్ చౌదరి, శ్రీనివాస్ యాదవ్, వెంకటేష్ రెడ్డి, వెంకటరెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బండారు లంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చేనేత కుటుంబాలకు ఆ జిల్లా కమిటీ అధ్యక్షులు జయనాథ్ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం బాధితులకు ఆర్థిక సాయం అందించారు. జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు, సిబ్బాల వెంకటరమణ, సిబ్బాల రమేష్ బాధితులకు ఆర్థిక సాయం చేయడానికి విరాళాలు సేకరించి కోనసీమ జిల్లా అధ్యక్షులకు పంపారు. అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయంతో పాటుగా లుంగీలు, చీరలు ఉపయోగకర వస్తువులను అందించారని చిన్నరెడ్డి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతా ఉమామహేశ్వరరావు, అప్పన్నపల్లి చేనేత నాయకుడు పిచ్చుక చిన్నగారు, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు కూర్మసాయి షణ్ముఖ, రాజోలు నియోజకవర్గం కన్వీనర్ కాశిన శివప్రసాద్, దేవాంగ సంఘ సభ్యులు బీరక శివయ్య, కాశిన రాజేంద్ర, సాయిస్వామి పాల్గొన్నారు.

'చాణిక్యకు షెల్టర్ ఇచ్చింది టీడీపీనే'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరిలో నాగరాజు అనే వ్యక్తిని హత్య చేసిన నిందితులలో ప్రధాన సూత్రధారి చాణిక్య ప్రతాప్ మాజీ ఎమ్మెల్యే బంధువేనని.. దీనిపై టీడీపీ స్పందించకుండా మౌనం వహించడంపై ఈ హత్య రాజకీయాల వెనుక టీడీపీ ఉందని సందేహం కలుగుతోందని వైసీపీ నాయకులు పసుపులేటి సురేష్, కిషోర్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాగరాజు హత్య వెనుక రాజకీయ పార్టీ కోణం ఉందని ఆరోపించారు. ఘాతుకానికి పాల్పడిన నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వైసీపీ పార్టీ తరపున కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, కార్పొరేటర్ నరేంద్ర, మధు, మద్దాలి శేఖర్ రాయల్ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిలో ముందుండాలి

ప్రజాశక్తి-రేణిగుంట: గ్రామీణ యువత స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ సర్జన్ రావు పిలుపునిచ్చారు. కరకంబాడి సమీపంలోని రాస్-కషి విజ్ఞాన కేంద్రంలో భారత వ్యవసాయ నైపుణ్య మండలి న్యూఢిల్లీ వారి సహకారంతో గ్రామీణ విద్యార్థులకు స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు 27 రోజుల వత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమం జరిగింది. సోమవారానికి శిక్షణ తరగతులు ముగిశాయని కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. శాస్త్రవేత్తలు డా.శ్రీలత, సుధాకర్, అనూషా పద్మజ, దివ్య, రాము కుమార్ తదితరులు పాల్గొన్నారు.